శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు వార్త

## ఆర్‌బికెలలో విజిలెన్స్ తనిఖీలు



**చేజర్ల, అక్టోబర్27, ప్రభాతవార్త:** చేజర్ల మండలంలోని మడపల్లి , చేజర్ల రైతు భరోసా కేంద్రాల్లో గురువారం విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. ఆర్‌బికెల ద్వారా రైతులకు అందించే విత్తనాలు, ఎరువులు సక్రమంగా అందుతున్నాయా లేదా అన్న విషయమై విజిలెన్స్ అధికారులు ఆరాతీశారు. అలాగే రైతు భరోసాకేంద్రాల్లోని రికార్డులను తనిఖీ చేశారు. ప్రభుత్వం సబ్సిడీపై రైతులకు అందిస్తున్న ఎరువులు, విత్తనాలు , వ్యవసాయ పరికరాలు దుర్వినియోగం కాకుండా చూడాలని విజిలెన్స్ సిఐ పెంచలరెడ్డి సూచించారు. గ్రామస్తులతో మాట్లాడారు. ఈకార్యక్రమంలో వ్యవసాయాధికారి వి.శశిధర్, విజిలెన్స్ సిబ్బంది రమణ, విఎఎలు పాల్గొన్నారు.

## పాతపాడులో చోరీ

**చేజర్ల, అక్టోబర్27, ప్రభాతవార్త:** చేజర్ల మండలం పాతపాడులో నిద్రిస్తున్న పామూరు లక్ష్మమ్మ అనే వృద్ధురాలి నుండి నాలుగున్నర సవర్ల బంగారాన్ని చోరీ చేసిన సంఘటన బుధవారం రాత్రి జరిగింది. సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. లక్ష్మమ్మ మంచంలో పడుకొని ఉండగా రాత్రి 11గంటల సమయంలో ఇరువురు యువకులు వచ్చి పడుకున్న మంచంమీదనే కట్టివేసి ఆమె అరవకుండా నోటీలో గుడ్డలు కుక్కి మెడలోని సరుడు, గాజులు , ఉంగరం లాక్కెళ్ళారు. కాసేపటికి తేరుకొని కట్లు ఊడదీసుకున్న లక్ష్మమ్మ కుటుంబ సభ్యులకు తెలియజేసింది. ఈలోగా వీధిలోకి వచ్చి చూసేలోగా దుండగులు మోటారుబైక్‌లో పరారయ్యారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ మరిడినాయుడు తెలిపారు.

# ఏపి జెన్‌కో ప్రాజెక్టు మూడవయూనిట్ జాతికి అంకితం

**ముత్తుకూరు, అక్టోబర్27, ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఎన్నికల సమయంలో మీకష్టాలను చూసి తర్వాత నేను విన్నాను నేను ఉన్నాని ఆరోజు చెప్పిన మాటను నిలబెట్టుకొని మత్యకారేతర ప్యాకేజి, ఫిషింగ్‌జెట్టి ఏర్పాటుకు శంకుస్తాపనచేసి మాట నిలబెట్టుకున్నానని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం ముత్తుకూరు మండలంలోని నేలటూరులో నిర్మితమైవున్న దామోదర సంజీవయ్య ధర్మల్ పవర్ ప్లాంటును ఆయన ప్రారంభించి మూడవయూనిట్‌ను జాతికంకితం చేశారు. ఈసందర్బంగా జరిగిన బహిరంగసభలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విద్యుత్‌రంగంలో మరో ముందడుగు వేయడం జరిగిందని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సూపర్‌క్రిటికల్ టెక్నాలజితో ఎ.పి జన్‌కోను స్వయంగా నిర్మించివున్న శ్రీదామోదరం సంజీవయ్య ధర్మల్‌ఫవర్ సేషన్‌లో 800మెగావాట్ల ప్లాట్‌ను ఈరోజు మీసమక్షంలోనే జాతికి అంకితం చేస్తున్నామని పేర్కొన్నారు. ఈథర్మల్ పవర్‌స్టేషన్ ఆనాడు ఉమ్మడి రాష్ట్రంలో మన దివంగతనేత ప్రియతమ నాయకుడు రాజశేఖరరెడ్డి2008లో శంకుస్తాపన చేశారన్నారు. ఈధర్మల్ పవర్‌స్టేషన్‌కు రాష్ట్ర తొలి దళిత ముఖ్యమంత్రి శ్రీదామోదరం సంజీవయ్య పేరు పెట్టుకున్నామన్నారు. నాణ్యమైన నిరంతర విద్యుత్‌కోసం రాష్ట్రంలోని గృహ, వాణిజ్య, పారిశ్రామిక రంగాల వినియోగదారులందరికి రోజంతా నరింతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడంతోపాటు వ్యవసాయ రంగానికి





9గంటలు ఉచిత విద్యుత్ సరఫరా చేయడంకోసం అన్నిచర్యలు తీసుకుంటున్నామన్నారు. మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈథర్మల్ పవర్‌స్టేషన్ లోని ఈప్రాజెక్టుకు 3200 కోట్ల రూపాయలు యుద్దప్రాతిపదికన ఖర్చుచేసి మూడు సంవత్సరాల నాలుగు నెలల కాలంలో ఈప్రాజెక్టును పూర్తిచేసి జాతాకంకితం చేశామన్నారు. రాష్ట్ర విద్యుత్ అవసరాలలో దాదాపు 45శాతం కరంటు ప్రభుత్వ రంగ విద్యుత్ సంస్తలు ఉత్పత్తి చేస్తున్నాయన్నారు. ఈప్లాంటునుంచి రోజుకి 19మిలియన్ యూనిట్‌ల విద్యుత్ ఎ.పి గ్రిడ్ ఇక్కడనుంచి సరఫరా అవుతుందన్నారు. సాదారణ దర్మల్ విద్యుత్ ప్లాంట్లతో పోలిస్తే సూపర్ క్రిటికల్ ప్లాంటు తక్కువ బొగ్గుతో విద్యుత్ ఉత్పత్తి చేస్తుందని దీని ద్వారా కాలుష్యం తగ్గుతుందన్నారు. నెరవేరిన మరో ఎన్నికల హామీ...ఇక్కడికి రావడానికి ప్రాజెక్టు ప్రారంబోత్సవం కారణమైతే మరో కారణం ఎన్నికల వేళలో మీకిచ్చిన హామీ నెరవేర్చడానికి ఇక్కడికి వచ్చానని ఆరోజు మీరంతా చెప్పారన్నారు. ఎన్నికల సమయంలో చంద్రబాబునాయుడుకి మేమంతా గుర్తుకొస్తామని ఆయన ఐదుసంవత్సరాల పాలనలో మాకేమి చేసిన దాఖలాలు లేవని నాదృష్టికి మీరు తీసుకువచ్చారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం మత్యకారేతర ప్యాకేజి, ఫిషింగ్ జట్టీని శంకుస్తాపన చేయడం జరిగిందన్నారు. చంద్రబాబు నాయుడు హయాంలో 3500మందికి 14వేలుకూడా సరిగా ఇవ్వని పరిస్తితిలో ఆరోజు వాళ్ళకి మిగతా సొమ్ము ఇవ్వడమే కాకుండా మిగిలిపోయిన 12787కుటుంబాలకు కూడా అందరికి ప్యాకేజి ఇస్తున్నామన్నారు. సర్వేపల్లి నియోజకవర్గానికి సంబందించి వ్యవసాయశాఖామంత్రి కాకాణి. గోవర్దనరెడ్డి ఉప్పు కాలువ వెంకటాచలం రోడ్‌నుంచి తిరుమలమ్మపాలెం హైలెవల్ బ్రిడ్జికోసం 12కోట్ల రూపాయలు, అలాగే నెల్లూరు నక్కలవాగు, కృష్ణపట్నం రోడ్‌నుంచి పొట్టింపాడు వయా బ్రహ్మదేవం వరకు మరో పదికోట్ల రూపాయలు అడిగిన వెంటనే మంజూరు చేశామన్నారు. అలాగే నెల్లూరు జిల్లాలోని పెన్నా నదిపై ముదివర్తి, ముదివర్తిపాలెం మద్య సబ్ మేర్జాబుల్ కాజ్‌వే నిర్మాణంకోసం 93కోట్ల రూపాయలు కేటాయిస్తూ దానికకూడా శంకుస్తాపన చేస్తున్నామన్నారు. నెల్లూరు బ్యారేజ్‌ను ఈమద్య కాలంలోనే ప్రారంబించామని దీనిక నల్లపరెడ్డి శ్రీనివాసులరెడ్డి పేరును ప్రకటిస్తున్నామన్నారు. ఈసెబ్ మెర్జాబుల్ చెక్‌డ్యామ్ కోసం 93కోట్ల రూపాయలు ఖర్చు అవుతుందని ఇటువంటి ప్రాజెక్టుకోసం దశాబ్దాలగా అడుగుతున్నా పట్టించుకోని పాలకులను మనంచూశామని ఈప్రాజెక్టు కట్టడంవల్ల సముద్రంలోకి పోయే వాటర్‌ను అపగలుగు తామని అలాగే సముద్రంనుంచి వచ్చే బ్యాక్ వాటర్‌కూడా ఆపగలుగుతామన్నారు. ఈప్రాజెక్టుకు కూడా శంకుస్తాపన చేస్తున్నామన్నారు. తద్వారా నాలుగు మండలా లకు నీటి సమస్య పరిష్కార మవుతుందన్నారు. ఒకవైపె కృష్ణాపట్నం పోర్టు మరోవైపు ధర్మల్‌పవర్ ప్రాజెక్టుకు భూమలిచ్చిన రైతులకు నిండుమనసుతో అబివాదం చేస్తున్నామన్నారు. ఇదివరకే 326కుటుంబాలకు ఉద్యోగాలు ఇవ్వడమే కాకుండా రెండవదశలో 150కుటుంబాలకు ఉద్యోగాలు ఇచ్చే ప్రక్రియను ఈనవంబర్ పూర్తయ్యేలోగా అడుగులు వేయాలని ఆదేశాలిచ్చామన్నారు. ఈకార్యక్రమంలో విద్యుత్ శాఖామంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, జిల్లా ఇన్‌చార్జ్‌మంత్రి అంబటి. రాంబాబు, వ్యవసాయశాఖామంత్రి కాకాణి. గోవర్దనరెడ్డి, ఎం.ఎల్.ఎలు అనిల్‌కుమార్ యాదవ్, నల్లపురెడ్డి. ప్రసన్నకుమార్‌రెడ్డి, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, వరప్రసాదరావు బాలినేని. శ్రీనివాసులరెడ్డి, కిలివేటి. సంజీవయ్య, ఎం.పిలు వేమిరెడ్డి. ప్రభాకర్‌రెడ్డి, ఆదాల. ప్రభాకర్‌రెడ్డి, గురుమూర్తి, జిల్లాకలెక్టర్ చక్రధర్‌బాబు, విద్యుత్‌శాఖ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి కె.విజయానంద్, జన్‌కో మేనేజింగ్ డైరెక్టర్ వి.శ్రీధర్, డిఐజి త్రివిక్రమవర్మ, ఎస్.పి విజయరావు, తదితరులు పాల్గొన్నారు.

**నెల్లూరు జిల్లాకు ముఖ్యమంత్రి రావడం చాలా అదృష్టం: కాకాణి**

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జిల్లాకు రావడం జిల్లా ప్రజలు, ప్రజాప్రతినిధులు అదృష్టంగా భావిస్తున్నామని వ్యవసాయశాఖామంత్రి కాకాణి. గోవర్దనరెడ్డి అన్నారు. గురువారం నేలటూరులో నిర్మితమైవున్న శ్రీదామోదం సంజీవయ్య ధర్మల్ పవర్‌ప్రాజెక్టు మూడవయూనిట్ ప్రారంభించి జాతికి అంకితం చేయడానికి సి.ఎం జగన్‌మోహన్‌రెడ్డి రావడం జరిగిందన్నారు. అనంతరం ఆయన బహిరంగాసభలో ఆయన మాట్లాడుతూ ఎన్నకల సమయంలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. మత్యకారేతర ప్యాకేజి ఆయన చేతుల మీదుగా పంపిణిచేసేందుకు బటన్‌నొక్కడం అలాగే మత్యకారుల ఫిషింగ్‌జెట్టి నిర్మాణంకోసం శంకుస్తాపన చేయడం జరిగిందన్నారు.

ఈరోజు ఒక చారిత్రాత్మకమైన విశేషమని చెప్పవచ్చన్నారు. ఈకార్యక్రమంవిజయవంతం చేసినందుకు ప్రతివక్కరికి కాకాణి ధన్యవాదాలు తెలిపారు.

## కావలి నుంచి శ్రీశైలంకు ప్రత్యేక ఆర్టీసి బస్సు సర్వీసులు



**కావలి, అక్టోబరు 27 ప్రభాతవార్త** కార్తీక మాసంను పురస్కరించుకొని శివ భక్తుల కోసం కావలి ఆర్టీసి డిపో నుండి శ్రీశైలంకు ప్రత్యేక ఆర్టీసి బస్సు సర్వీసులు ప్రారంభించినట్లు కావలి డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. కావలి ఆర్టీసి డిపో నుంచి ప్రతి రోజు ఉదయం 9 గంటల 25 నిమిషాలకు శ్రీశైలం బస్సు బయలుదేరుతుందన్నారు. సాయంత్రం 5.30 గంటలకు శ్రీశైలంకు వెళ్తుందన్నారు. తిరిగి అక్కడ ఉదయం 6.30 గంటలకు ఈ బస్సు బయలుదేరి కావలి డిపోకు మధ్యాహ్నం 2.30 గంటలకు చేరుతుందని తెలిపారు. ఈ ప్రత్యేక ఆర్టీసి బస్సులో శ్రీశైలంకు వెళ్లిన వారు భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామిని దర్శించుకొని అదే బస్సులో కావలికి రావచ్చునని తెలిపారు. కావలిలో బయలుదేరి దాదాపు 26 గంటల లోగా రెండు సార్లు దైవదర్శనం చేసుకొని కావలికి వచ్చే విధంగా బస్సు సర్వీసును ఏర్పాటే చేశామన్నారు. రానుపోను రిజర్వేషన్ సౌకర్యం కూలా కల్పించామన్నారు. కావలి ప్రాంత ప్రజలు, భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆశీస్సులు పొందాలని ఆయన కోరారు.

# ముఖ్యమంత్రికి ఆజన్మాంతం రుణపడి వుంటాం

**కోవూరు అక్టోబర్ 27 ప్రభాతవార్త** రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి నల్లపరెడ్ల కుటుంబం ఆజన్మంతాం రుణపడి ఉంటామని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పేర్కున్నారు. కోవూరులోని రుక్మిణి కళ్యాణ మండపంలో గురువారం జరిగిన తూర్పు రాయలసీమ ఉపాధ్యాయల పట్టభద్రుల పరిచయ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతు గురువారం సర్వేపల్లిలో జరిగిన ఒ కార్యక్రమంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాకు ఎంతో మేలు చేసేలా రెండు వరాలు ప్రకటించారని అన్నారు. 93 కోట్ల వ్యయంతో ముదివర్తిపాళెం నుండి ముదివర్తి వరకు సబ్‌వే కాజ్‌వే నిర్మాణానికి శిలాపలకం కూడా సిఎం ఆవిష్కరించారని అన్నారు. అదే విధంగా నెల్లూరులోని పెన్నా బ్యారేజి కి మా తండ్రి దివంగత మాజీ మంత్రి నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి పేరుపెట్టి మా హృదయాలు ఆనందంతో పులకరించేలా చేశారని సిఎంకి చివరి రక్తం బొట్టు ఉన్నంత వరకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వెంటనే తమ కుటుంబం పయనిస్తుందని సభికుల హర్షద్వానాల మధ్య ప్రకటించారు. ఖాజ్‌వే నిర్మాణం పూర్తి అయితే



కోవూరు, ఇందుకూరుపేట, విడవలూరు, నెల్లూరు మండలాలకు మంచినీటి సమస్య లేదన్నారు. రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఈ ఖాజావే విషయం ఆయన దృష్టికి తీసుకొని రాగా ఆయన తనయుడు ఇప్పుడు దానిని చేపట్టేలా చర్యలు తీసుకోవడం అభినందనీయమని అన్నారు.

**మాజీ మంత్రి అనీల్ మంచి వ్యక్తి**

ఇటీవల కాలంలో అనీల్‌కుమార్‌యాదవ్ తమ ఇంటికి వచ్చి పెన్నా బ్యారేజికి శ్రీనివాసులురెడ్డి పేరు పెడతామని తనతో చెప్పారని ఈవిషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి కూడా తీసుకొని వెళతారని చెప్పారని అన్నారు. ఇంత చిన్న వయస్సులో మంత్రిగా చేసి మంచి పేరు తెచ్చుకున్న అనీల్‌కుమార్ ఈ విషయాన్ని నా దృష్టికి తీసుకొని వచ్చి చర్చించడం తనకు ఎంతో ఆనందం కలిగిందని అన్నారు. అదే విధంగా పెన్నా బ్యారేజి ప్రాంతంలో నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి విగ్రహం కూడా ఏర్పాటు చేయాలని అనీల్‌కుమార్ ప్రకటించడం ఆయన ఔనత్యానికి నిదర్శనమని అన్నారు. ఒకే రక్తం పంచుకొని పుట్టుకపోయిన అనీల్‌కుమార్ తన తమ్ముడుతో సమానమని కొనియాడారు. ఈకార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ ఆనం అరుణమ్మ, డిసిఎంస్ చైర్మన్ వీరి చలపతిరావు, జిల్లా వ్యవసాయ మండలి చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, అప్కాప్ చైర్మన్ కె అనీల్‌బాబు ,ఎంఎంసి చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, బుచ్చి నగరపాలక పంచాయితీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, జొన్నవాడ దేవస్దానం చైర్మన్ పుట్టా సుబ్రమణ్యంనాయుడు, వవ్వేరు బ్యాంకు చైర్మన్ సూరా శ్రీనివాసులురెడ్డి, పెన్నాడెల్టా ప్రాజక్టు మాజీ చైర్మన్ యర్రంరెడ్డి గోవర్దన్‌రెడ్డి, పడుగుపాడు సొసైటీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, మండల వ్యవసాయ సలహామండలి చైర్మన్ ప్రసాద్‌రెడ్డి, జడ్‌పిటిసి సభ్యురాలు శ్రీలత, ఎంపిపి టి.పార్వతి, వైస్ ఎంపిపి నరసింహులురెడ్డి, కోవూరు నియోజవకర్గ పరిధిలోని 5 మండలాలకు సంబందించిన ప్రజా ప్రతినిదులు నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్బంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాబిషేకం చేసి అంతకుముందు దివంగత మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేస నివాళుర్పించారు.

## సీఎంకు స్వాగతం పలికిన కలెక్టర్, జెడ్పీచైర్‌పర్సన్







**నెల్లూరు కలెక్టరేట్, అక్టోబరు 27 ప్రభాతవార్త** ముత్తుకూరు మండలం నేలటూరులోని శ్రీదామోదరం సంజీవయ్య ఏపిజెన్‌కో ధర్మల్‌పవర్ స్టేషన్‌లో మూడవ యూనిట్‌ను జాతికి అంకితం చేసేందుకు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్‌జగన్మోహన్‌రెడ్డికి ఘన స్వాగతం లభించింది. హెలీప్యాడ్ వద్ద జిల్లా కలెక్టర్ కేవీఎన్‌చక్రధర్‌బాబు, జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, ఎన్‌డీసీసీబీ మాజీ చైర్మన్లు ఆనం విజయకుమార్‌రెడ్డి, మెట్టుకూరు ధనంజయరెడ్డి, ఆనం కార్తీకేయరెడ్డి తదితరులు సీఎంలకు బొకేలు అందజేసి స్వాగతం పలికారు.

## నేడు రాపూరు మార్కెటింగ్ కమిటీ ప్రమాణ స్వీకారం

**రాపూరు, అక్టోబరు 27 ప్రభాతవార్త** రాపూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకరాం శుక్రవారం నియోజకవర్గ కేంద్రమైన వెంకటగిరిలో నిర్వహించనున్నారు. వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణ రెడ్డి సహకారంతో మూడవ పర్యాయం కూడా సైదాపురం మండలానికి చెందిన నోటి రమణా రెడ్డినే మార్కెటింగ్ కమిటీ ఛైర్మన్‌గా నియమించారు. రాపూరు మండలం నుండి కమిటీలో పంగిలి గ్రామానికి చెందిననల్లు మౌనిక, రాపూరుకు చెందిన కూనిపోగు సంపూర్ణమ్మ, గంగిశెట్టి వెంకటేశ్వర్లు, జోరేపల్లి గ్రామానికి చెందిన తలుపూరు సుబ్బరాఘవరెడ్డి, గండురుపల్లి గ్రామానికి చెందిన బిల్లు వెంకటరత్నం, ఎక్స్ ఆఫిషియో సభ్యునిగా జోరేపల్లి గ్రామ సర్పంచ్ శ్రీనివాసులు రాపూరు యంపీపీ చెన్ను బాలకృష్ణా రెడ్డి సహకారంతో కమిటీలో స్థానం పోందారు. తమకు ఏయంసీలో డైరెక్టర్‌లుగా స్థానం కల్పించిన వెంకటగిరి ఏమ్మెల్యే ఆనం రామనారాయణ రెడ్డికి, రాపూరు యంపీపీ చెన్ను బాలకృష్ణా రెడ్డికి రాపూరు మండలానికి చెందిన నూతన డైరెక్టర్‌లు ధన్యవాధాలు తెలిపారు.

## రెడ్‌క్రాస్‌లో క్యాన్సర్‌పై అవగాహన



**నెల్లూరు అక్టోబర్ 27, ప్రభాతవార్త-వైద్యం** ఇండియన్ రెడ్‌క్రాస్ నెల్లూరు జిల్లా శాఖ, రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో గురువారం నగరంలోని మద్రాసు బస్టాండు సమీపంలో ఉన్న రెడ్‌క్రాస్ కార్యాలయంలో క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రధాన అతిధిగా క్యాన్సర్ ఆసుపత్రి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ టి.లక్ష్మి పాల్గొన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో 500మంది విద్యార్థినులకు రొమ్ము క్యాన్సర్‌పై డాక్టర్ లక్ష్మి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రి నుంచి అవగాహన సదస్సులో ప్రముఖ వైద్యులు డాక్టర్ ఎం.నాగేశ్వరరావు, ఆంకాలజిస్ట్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ గీతఉషశ్రీ, రేడియేషన్ ఆంకాలజిస్ట్ డాక్టర్ ఏ.లోకేశ్వరి, రేడియేషన్ ఆంకాలజిస్ట్ డాక్టర్ ఎన్.తేజేశ్వర్, మెడికల్ ఆంకాలజిస్ట్‌లు పాల్గొని రొమ్ము క్యాన్సర్ నివారణకు తగిన సూచనలు విద్యార్థినిలకు తెలియచేశారు. తదుపరి డాక్టర్ లక్ష్మి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డబ్ల్యూహెచ్ ఓ ప్రపంచ ఆరోగ్య సంస్థ అక్టోబర్ నెలను రొమ్ము క్యాన్సర్ అవగాహన మాసంగా పరిగణించారని వెల్లడించారు. భారతదేశంలో 37శాతం మహిళలు క్యాన్సర్ బారినపడుతున్నారని వివరించారు. 30 నుంచి 40 ఏళ్ళు మద్య మహిళల్లో ఎక్కువగా ఈ వ్యాధి బారినపడుతున్నారని దాని బారినపడకుండా ఉండాలంటే జంక్‌ఫుడ్, ఆహారపు అలవాట్లు, ఊబకాయము, వ్యాయామం లేకపోవడమేనని ఆమె తెలిపారు. 40 ఏళ్ళ మహిళలు రొమ్ము ఎక్స్‌రే, మెమోగ్రామ్ చేయించుకోవడం, హెచ్‌పివి వ్యాక్సిన్ వేయించుకోవడం మంచిదన్నారు. ఈ వ్యాక్సిన్‌ను ఆరు నెలల్లో మూడు డోసులు వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ఏఒ చంద్రశేఖర్, స్ప్రాస్టిక్ సెంటర్ ప్రిన్సిపల్ గురునాథం, క్యాన్సర్ ఆసుపత్రి జనరల్ మేనేజర్ జూబేర్, రెడ్‌క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

## రైతు అకౌంట్‌లో నగదు గల్లంతు

### లబోదిబోమంటున్న బాధితుడు



**మనుబోలు, అక్టోబరు 27 ప్రభాతవార్త** మనుబోలు ఎస్‌బిఐ బ్యాంకులో రైతు ఖాతాలో వున్న 50 వేల రూపాయల నగదును సైబర్ నేరగాళ్ల నొక్కేశారు. దీంతో బాధితుడు గిద్దలూరు రమణయ్య బ్యాంకు మేనేజర్‌కు సమాచారం ఇచ్చి మనోబోలు పోలీస్ స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశాడు. బాధితుడు కథనం మేరకు వివరాలు ఇలావున్నాయి. మండలంలోని కట్టోపల్లి గ్రామానికి చెందిన గిద్దలూరు రమణయ్య బ్యాంక్ ఖాతాకు పది రోజుల క్రితం బద్దెవోలు గ్రామంలోని బివిఆర్ ఎరువుల డిపో నుండి తన ఖాతాలోకి లక్షా 32 వేల రూపాయలు ఆన్‌లైన్‌లో జమ చేయించుకున్నాడు. బుధవారం బ్యాంకుకు వచ్చి క్రాప్ లోన్ అప్పు కట్టేందుకు ఓచర్ రాశాడు. ఖాతాలోని డబ్బులు 50 వేల రూపాయల నగదును 21వ తేది నుండి 25వ తేది వరకు వరుసగా ఐదు రోజులు రోజు పది వేలు వంతున సైబర్ నేరగాళ్ల లాగేసినట్లు బ్యాంక్ స్టేట్‌మెంట్ ద్వారా తెలుసుకున్నారు. వెంటనే రమణయ్య మేనేజర్‌కు తన ఖాతాలో వున్న డబ్బులు గల్లంతు అయ్యాయని సమాచారం ఇచ్చి మనుబోలు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశాడు. ఈ మధ్యకాలంలో మనుబోలు స్టేట్‌బ్యాంక్‌లో అనేక మంది ఖాతాదారుల డబ్బులు సైబర్ నేరగాళ్ల లాగేసినట్లు నమోదయ్యాయి. ఒకప్పుడు బ్యాంకు ఖాతాలో నగదు ఓచర్ రాసి ఖాతాదారుడు డ్రా చేసుకునేవాడు. అప్పట్లో డబ్బుకు భద్రత వుండేది. ఆన్‌లైన్ సేవలు పెరిగిన తర్వాత బ్యాంకుల్లో నగదు సైబర్ నేరగాళ్ళకు వరంగా మారింది.

## పెన్నానదిలో వ్యక్తి మృతి



**సంగం అక్టోబర్ 27 ప్రభాతవార్త** మండలకేంద్రమైన సంగంలోని పెన్నానదిలో ఒ వ్యక్తి మృతదేహాన్ని స్దానికులు కనుకొని పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు సంఘటనా స్దలానికి చేరుకొని మృతదేహాన్ని వెలికితీశారు. మృతుడు సంగం ఎస్‌సి కాలనీకి చెందిన బాబురావుగా గుర్తించారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# డిసెంబర్ 21 నాటికి గృహ ప్రవేశాలు జరగాల

**నెల్లూరు కార్పొరేషన్, అక్టోబరు 27, ప్రభాతవార్త:** నవరత్నాలు పథకంలో రాష్ట్ర ప్రభుత్వం పేదలందరికీ గృహాలు అందించే కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసి డిసెంబర్ 21వ తేది నాటికి గృహ ప్రవేశాలు జరిగేలా పర్యవేక్షించాలని అధికారులను కమిషనర్ డి.హరిత ఆదేశించారు. జగనన్న కాలనీల ప్రగతిపై ఇంజనీరింగ్, హౌసింగ్ విభాగం అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గృహ నిర్మాణాలపై లబ్దిదారులకు ప్రోత్సాహం కలిగించే దిశగా కొన్ని కాలనీల్లో అందమైన మోడల్ గృహాలను నిర్మించి ప్రదర్శనకు ఉంచాలని



సూచించారు. అర్హులైన లబ్దిదారులతో బ్యాంకు ఖాతాలు తెరిపించి గృహ రుణాలను వేగవంతంగా మంజూరు చేయించాలని ఆదేశించారు. జగనన్న కాలనీల్లో ప్రస్తుతం బేస్‌మెంట్ పూర్తయిన గృహాలు, స్లాబ్ పూర్తి చేసుకున్న గృహాల వివరాలను అడిగి తెలుసుకున్న కమిషనర్ మౌలిక వసతుల కల్పనను కూడా త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేయడంతో పాటు పనుల్లో నాణ్యత, పారదర్శకత పాటించాలని కమిషనర్ ఆదేశించారు. గృహాలు మంజూరైన లబ్దిదారులు కొంతమంది ప్రస్తుతానికి నగర పరిధిలో అందుబాటులో లేరని, వారిని సంప్రదించేందుకు కృషి చేయాలని సూచించారు. ఇతర ప్రాంతాల్లో తాత్కాలికంగా స్థిరపడిన గృహాల లబ్దిదారులకు సమాచారం అందించి, రిజిస్ట్రేషన్ ప్రక్రియలో పాల్గొనేలా ప్రోత్సహించాలని సూచించారు. జగనన్న కాలనీలు, టిడ్కో గృహ సముదాయాల్లో మౌలిక సదుపాయాలు కల్పించి త్వరితగతిన అందుబాటులోకి తేవాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జ్ హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ నాగరాజు, నగరపాలక సంస్థ ఎస్ఈ సంపత్‌కుమార్, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, సెక్రటరీ హేమావతి, హౌసింగ్ విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆత్మకూరు గ్రామంలో వైద్యశిబిరం

**ఉలవపాడు, అక్టోబరు 27, ప్రభాతవార్త :** కరేడు ప్రాధమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న ఆత్మకూరు గ్రామంలో సచివాలయం, ఆంధ్రపాలెం, కుమ్మరిపాలెంలలో ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఫ్యామిలీ డాక్టర్ ట్రైల్ రన్ కార్యక్రమం వైద్యాధికారి డాక్టర్ కే.శ్రీనివాసులు, లక్ష్మీ నరసింహాలు ప్రారంభించారు. గ్రామంలోని ప్రజలకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఆంధ్రపాలెంలో షుగర్ వ్యాధితో బాదపడుతున్న వ్యక్తిని పరీక్షించి వారికి సూచనలు, జాగ్రత్తలు తెలియజేశారు. ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల ప్రకారం ప్రతి అంశాన్ని ఈ కార్యక్రమం నందు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్ కే.రాగవశ్రీ, ఆరోగ్య కార్యకర్తలు, అల్తాఫ్, శోభాదేవి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## టిడిపి కార్యకర్తలకు అండగా ఉంటాం



**కందుకూరు, అక్టోబర్27, ప్రభాతవార్త:** తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు కష్టాల్లో ఉంటే వారికి ఎటువంటి సహాయమైనా అందిస్తామని టిడిపి నెల్లూరు పార్లమెంట్ ఉపాధ్యక్షులు ఇంటూరి రాజేష్ అన్నారు. గురువారం కందుకూరు, గుడ్లూరు మండలాల్లో ఆయన పర్యటించారు. గుండ్లపాలెంలో బొబ్బూరి వెంకటసుబ్బయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అక్కడ గ్రామస్తులతో మాట్లాడారు. అనంతరం అదే మండలం కొత్తపేటలోని అంబేద్కర్‌నగర్‌కు చెందిన వికలాంగులకు ఆర్థిక సహాయం అందజేశారు. తాడిపర్తి చిన్నమాల్యాద్రికి ట్రైసైకిల్ అందజేశారు. అదే గ్రామానికి చెందినకవలా కోటయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. వారి కుటుంబసభ్యులకు 10వేల రూపాయలు అందజేశారు. అంతకు మునుపు నోబెల్ టీచర్స్ అసోసియేషన్ 500మంది ఉపాధ్యాయులకు లంచ్ బాక్స్‌లు అందజేశారు.

## పెండింగ్ సమస్యలపై సిఎంకు విజ్ఞప్తి



**కందుకూరు, అక్టోబర్27, ప్రభాతవార్త:** కందుకూరు సీనియర్ శాసనసభ్యులు మానుగుంట మహీధర్‌రెడ్డి నియోజకవర్గానికి చెందిన పలు అంశాలపై గురువారం ముఖ్యమంత్రితో చర్చించారు. జిల్లాలోని ముతుకూరు మండలంలో థర్మల్ విద్యుత్ కేంద్రం ప్రారంభోత్సవానికి వచ్చిన ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. కార్యక్రమం అనంతరం ముఖ్యమంత్రితో 10నిమిషాలు మాట్లాడారు. రామాయపట్నం పోర్టు పనులగురించి ఎమ్మెల్యే సిఎం దృష్టికి తీసుకువచ్చారు. విమానాశ్రయం ఏర్పాటు గురించి కూడా చర్చించారు. నియోజక వర్గానికి కావాల్సిన నిధులను గురించి మాట్లాడిన తదుపరి సిఎం పలుశాఖ అధికారులకు మహీధర్‌రెడ్డి చర్చించిన అంశాలను గురించి మాట్లాడారు. వీటిపై దృష్టి సారించి సంబంధిత పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని వెను వెంటనే నిధులు మంజూరు చేసి పూర్తి చేయాలని ఆదేశించడం జరిగింది.

## కండలేరులో 53.686 టీయంసీల నీటిమట్టం

**కండలేరుడ్యాం(రాపూరు), అక్టోబరు 27 ప్రభాతవార్త:** మండలంలోని కండలేరు జళాశయంలో గురువారం ఉదయానికి 53.686 టీయంసీల నీటిమట్టం నమొదు అయినట్లు కండలేరు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. ఇందులో సోమశిల కండలేరు వరద కాలువ ద్వారా జళాశయంలోకి 1130 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లోగా వుండగా జళాశయం నుండి లోలెవల్ స్లూయిస్ నుండి 100 క్యూసెక్కులు, హైలెవల్ కెనాల్ నుండి 130 క్యూసెక్కుల నీరు, హెడ్ రెగ్యులేటర్ నుండి సత్యసాయి గంగ కాలువలోకి 1700 క్యూసెక్కుల నీరు, పిన్నేరు వాగుకు 50 క్యూసెక్కులు, 1 వ బ్రాంచి కెనాల్‌కు 25 క్యూసెక్కుల చోప్పున మొత్తం 2105క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లోగా వెలుతున్నట్లు తెలిపారు.

## అయ్యప్ప స్వామి ఆలయంలో రెండవ రోజు అన్నదానానం

**రాపూరు, అక్టోబరు 27 ప్రభాతవార్త:** మండల కేంద్రమైన రాపూరులోని శ్రీశ్రీశ్రీ మహావిష్ణువు, శ్రీశ్రీశ్రీ అయ్యప్ప స్వామి వారి ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా అయ్యప్ప స్వాములకు నిర్వహిస్తున్న అన్నదానం రెండవ రోజైన గురువారం నిర్వహించారు. ఉదయం స్వామి వారి ఆలయంలో శ్రీ మహావిష్ణువుకు, శ్రీ అయ్యప్ప స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పెద్ద ఎత్తున్న భక్తులు ఆయ్యప్ప మాలాధారణ చేసుకున్నారు. మద్యాహ్నం స్వామి వార్లకు పూజలు నిర్వహించిన అనంతరం మాలాధరణ చేసిన ఆయ్యప్ప స్వాములకు, గోవింద స్వాములకు అన్నదానం నిర్వహించారు. రెండవ రోజు అన్నదానానికి రాపూరులో అంకమ్మ తల్లి మొబైల్స్ షాపు నిర్వహిస్తున్న రామిరెడ్డి పల్లి గ్రామానికి చెందిన కొత్తాపు మహేష్ వ్యవహరించారు.

## పట్టభద్రుల ఓటుకు ధరఖాస్తు చేసుకోవాలి



**విడవలూరు అక్టోబర్ 27 ప్రభాతవార్త:** విడవలూరు మండలంలోని ఉపాధ్యాయ పట్టభద్రుల ఓటు హక్కు నమోదుకు అర్హులైన ప్రతి ఒక్కరు ధరఖాస్తు చేసుకోవాలని విడవలూరు ఎంఇఒ నాగపద్మ తెలిపారు. స్దానిక ఎంఇఒ కార్యాలయంలో గురువారం ఆమె మాట్లాడుతు ఓటుహక్కునమోదు చేసుకునేందుకు అర్హత కల్గిన వారు వారి విద్యార్హత సర్టిఫికేటు ఆదార్ జెరాక్స్ రెండు పోటోలు జతచేసి ధరఖాస్తు ఫారంతో నవంబర్ నెల 7 వ తేది లోగా మండల ఎంఇఒ కార్యాలయంలో అందజేయాలని కోరారు. గతంలో ఉన్ న ఓటర్ల జాబితాను రద్దు చేయడం జరిగిందని అర్హులైన ప్రతి ఒక్కరు విధిగా తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని ఆమె కోరారు.

## రేపటి నుండి క్రీడా ఎంపికలు

**చేజర్ల, అక్టోబర్27, ప్రభాతవార్త:** చేజర్ల మండలానికి సంబంధించి మండల స్థాయి క్రీడాఎంపికలు 29న ప్రారంభిస్తామని చేజర్ల జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయిని పులుసు హైమావతి పేర్కొన్నారు. స్కూల్‌గేమ్ ఫెడరేషన్ నెల్లూరు జిల్లా క్రీడా సమాఖ్య వారి ఆధ్వర్యంలో మండల స్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు .ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, త్రోబాల్, బాడ్మింటన్ , బాల్‌బాడ్మింటన్ , యోగా , టెన్నికాయిట్, అథ్లెటిక్ లలో అండర్ 17, అండర్ 14 బాల బాలికల కోసం ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. మండలంలోని అన్ని ప్రభుత్వ , ప్రవేటు పాఠశాలలతోపాటు గురుకుల పాఠశాలల విద్యార్థులు కూడా పోటీల్లో పాల్గొనాలని ఆమె తెలిపారు .ఫిజికల్ డైరెక్టర్ పి.మల్లిఖార్జునరావ్ ఆధ్వర్యంలో ఈ క్రీడలు జరగనున్నాయని ఆమె తెలిపారు.

## వింజమూరు-ఆత్మకూరు రహదారికి మరమ్మత్తులు చేయాలి



**వింజమూరు, అక్టోబర్27, ప్రభాతవార్త:** వింజమూరు నుండి ఆత్మకూరుకు వెళ్ళే రహదారి అధ్వాన్నంగా తయారైందని వెంటనే మరమ్మత్తులు చేయాలని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ని వింజమూరు జడ్పీటిసి సభ్యులు గణపం బాలకృష్ణారెడ్డి కోరారు. గురువారం నెల్లూరులోని ఎపి జన్‌కోను ప్రారంభించేందుకు వచ్చిన సందర్భంగా గణపం సిఎంను కలిసి వినతిపత్రం అందజేశారు. వింజమూరు నుండి ఆత్మకూరుకు వెళ్ళే రహదారి 9వ కిలోమీటర్‌నుండి 15వ కిలోమీటర్‌వరకు రోడ్డు అత్యంత దారుణంగా తయారై ఉందని, కనీసం నడిచేందుకు కు వీలులేకుండా ఉందన్నారు .ఈ రహదారిపై రోజుకు 200పైచిలుకు వాహనాలు తిరుగుతుంటాయన్నారు . ఆత్మకూరు లో ప్రభుత్వ జిల్లా వైద్యశాల ఉండడం , పేరున్న వైద్యశాలలు ఒడడం తో ,పెద్ద పట్టణం కావడంతో నిత్యం వింజమూరు నుండి వేలాది మంది ప్రయాణిస్తుంటారన్నారు. ఆత్మకూరు నుండి విజయవాడవైపుకు వెళ్ళేందుకు ఈ రహదారి ప్రధానమార్గంగా ఉందన్నారు. ఉదయగిరి నియోజకవర్గంలోనే మేజర్ గ్రామ పంచాయతీగా దాదాపు 35వేల జనాభా ఉన్నారని ఈ ప్రాంతప్రజలునెల్లూరు, కడప ప్రాంతాలకు వెళ్ళేందుకు ఈ రహదారి ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. కావున రహదారి పనులు వెంటనే జరిగేలా చూడాలని ఆయన కోరారు .

## జాతిపిత మహాత్మా గాంధీజీని విమర్శిస్తే మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోంది




**కావలి, అక్టోబరు 27 ప్రభాతవార్త:** జాతిపిత మహాత్మా గాంధీజీని విమర్శిస్తే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని కావలి పట్టణంలోని ఆర్యవైశ్య నేతలు తీవ్ర స్థాయిలో హెచ్చరికలు చేశారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్ మహాత్మా గాంధీపై చేసిన వ్యాఖ్యల్ని ఖండిస్తూ కావలి పట్టణంలో గురువారం రాత్రి ఆర్యవైశ్య నేతలు కొవ్వొత్తులతో నిరసన నినాదాల ప్రదర్శన నిర్వహించారు. కావలి డివిజన్, మండల ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యంలో ఈ నిరసన కార్యక్రమం జరిగింది. విక్టర్ ప్రసాద్ వ్యాఖ్యల్ని నిరసిస్తూ కావలి పట్టణంలోని అమరజీవి విగ్రహం నుంచి గాంధీజీ విగ్రహం వరకు జాతీయ రహదారిపై కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. వైసిపి వైశ్య నేతలు తిరివీధి ప్రసాద్, కనమర్లపూడి వెంకట నారాయణ, అమరా వేదగిరి సుబ్బరాయుడు గుప్తా, డాక్టర్ మనోహర్‌బాబు, మామిడి రామకృష్ణ, ఒరుగంటి రామకృష్ణ, నల్లూరు వెంకట రమేష్, తదితరులు పాల్గొని మాట్లాడారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన జాతిపిత గాంధీని విమర్శించడం దుర్మార్గమన్నారు. ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్ అవగాహన లేకుండా బాధ్యతారాహిత్యంతో చేసిన అనుచిత వ్యాఖ్యలను బేషరతుగా వెనక్కి తీసుకొని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహనీయుడు, అన్ని కులాల వారిని అక్కున చేర్చుకున్న మకుటం లేని మహారాజు జాతిపిత అని కొనియాడారు. ఆర్యవైశ్యుల జోలికి వచ్చినా, మనోభావాలను దెబ్బతీసిన వారికి పుట్టగతులు వుండవని శాపనార్థాలు పెట్టారు. విక్టర్ ప్రసాద్‌ను పదవి నుంచి వెంటనే తొలగించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని ఆర్యవైశ్య నేతలు డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ముఖ్యమంత్రి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. విక్టర్ ప్రసాద్‌ని వైసిపి పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఇలాంటి చీడ పురుగుల్ని వెంటనే ఏరిపారేయాలని ముఖ్యమంత్రిని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి మీనమేషాలు లెక్కపెట్టకుండా వెంటనే విక్టర్ ప్రసాద్‌ని పదవి నుంచి తొలగించి పార్టీ నుండి సస్పెండ్ చేసి కఠిన చర్యలు గైకొనాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య నేతలు బొగ్గవరపు వెంకట సత్యనారాయణ, నల్లూరి మాధవ, బచ్చు వీరాస్వామి, పాదర్తి నాగరాజు, ఒరుగంటి సురేష్, కొండలరావు, పెట్టుగాని రమేష్, పబ్బిశెట్టి చంద్ర, తంగుటూరి శివప్రసాద్, పేరూరి లక్ష్మీనారాయణ, కుదవ వ్యాపారస్తులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి పర్యటన దృశ్యమాలిక



























## మండలస్థాయి క్రీడా ఎంపికలు ప్రారంభం



**బిట్రగుంట, అక్టోబర్27, ప్రభాతవార్త:** బోగోలు మండలం విశ్వనాదరావుపేట జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో గురువారం మండలస్థాయి క్రీడాపోటీలకు సంబందించి వివిద క్రీడల్లో ప్రతిభ కలిగిన వారిని ఎంపికచేసే ప్రక్రియని మండల విద్యాశాఖాదికారి జయంతిబాబు ప్రారంభించారు. జిల్లా విద్యాశాఖాదికారి ఆదేశాను సారం మూడురోజులపాటు మండలస్థాయిలో వివిద ప్రభుత్వ, ప్రవేటు యాజమాన్యాలలో చదువుతున్న 11, 14, 17 వయస్సు కలిగిన బాలబాలికలను వివిద క్రీడల్లో ఎంపికచేయనున్నారు. తొలిరోజు జరిగిన ఈకార్యక్రమంలో క్రీడల ప్రాముఖ్యతను వ్యక్తలు వివరించగా ఇందులో గ్రామ సర్పంచ్ గండూరి. మంజుల విశ్వనాద రావుపేట జిల్లాపరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల ప్రధానోపాద్యాయులు రవీంద్రనాద్ ఠాగూరు, చెంచులక్ష్మిలతోపాటు వివిద పాఠశాలలకు చెందిన వ్యాయామ ఉపాద్యాయులు బాల, బాలికలు పాల్గొన్నారు.

## రైలు పట్టాలపై కుళ్ళిపోయిన మృతదేహం

**బిట్రగుంట, అక్టోబర్27, ప్రభాతవార్త:** విజయవాడ రైల్వేడివిజన్ పరిదిలోని తలమంచి, అల్లూర్‌రోడ్ రైల్వే స్టేషన్‌లమధ్య షుమారు 40 సంవత్సరాల వయస్సు కలిగిన పురుషుని కుళ్ళిపోయిన శవం లభ్యమైనట్లు జిఆర్‌పి ఎస్.ఐ అరుణకుమారి తెలిపారు. విధినర్వహణలోవున్న రైల్వే కీమెన్ బబులు కుమార్ బిట్రగుంట రైల్వేస్టేషన్ మేనేజర్‌కు సమాచారమందించగా తాము మృతదేహాన్ని స్వాదీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఆమె తెలిపారు. అభ్యమైన మృతదేహం దిగువలైన్లో రైల్లోనుంచి జారిపడి మృతిచెందివుండవచ్చని ఈసంఘటన వారంరోజులు క్రిందట జరిగివుంటుందని భావిస్తున్నామని ఆమె తెలిపారు. చెట్లపొదల్లో పడవుండడంవల్ల శవం కుళ్ళిపోయి పరుగులు పట్టివుందని మృతుడు సిమెంటురంగు ఆఫ్ హ్యాండ్ టీషర్టు, సిమెంటురంగు ప్యాంటు దరించివున్నాడని ఎలాంటి ఆదారాలు లభ్యంకాలేదని ఆమె తెలిపారు.

## బోగోలు సాయిబాబా మందిరంలో ఆకాశాదీపోత్సవం ప్రారంభం



**బిట్రగుంట, అక్టోబర్27, ప్రభాతవార్త:** మండలకేంద్రమైన బోగోలు రాజావీదిలోని శ్రీషిరిడి సాయిబాబా మందిరంలో కార్తీకమాసాన్ని పురస్కరించుకొని ఆకాశ దీపోత్సవం కార్యక్రమాన్ని మందిర ట్రస్టు చైర్మన్ ఎన్‌ఆర్‌ఐ దంపతులైన బచ్చు కృష్ణకుమార్, సంధ్యారాణి దంపతులు ఘనంగా ప్రారంబించారు. వేదమంత్రాల నడుమ ఈకార్యక్రమాన్ని తిలకించేందుకు భక్తులు అధికసంఖ్యలు హాజరయ్యారు. కాగా గురువారం కార్తీకమాసం సందర్భంగా ప్రత్యేక పూజలతోపాటు జరిగిన అన్నదాన కార్యక్రమానికి మానికల సుబ్బరామయ్య సతీమణి లలితమ్మ, కుటుంబసభ్యులు ఐశ్వర్య ఉభయకర్తలుగా వ్యవహరించారు

## స్కూటర్‌ను ఢీకొన్న మినీలారి ఒకరుమృతి ఇద్దరికి గాయాలు



**జలదంకి, అక్టోబర్27, ప్రభాతవార్త:** జలదంకి మండలం చినక్రాక ఎస్.సి కాలనీ సమీపాన కె.యు రోడ్‌పై గురువారం మినీలారి స్కూటర్‌ను డీకొన్న సంఘటనలోఒకరు మృతిచెందగా ఇద్దరుగాయపడ్డారు. పోలీసుల కధనం మేరకు కలిగిరి మండలం అనంతపురానికి చెందిన బొడ్డు. దినేష్(17) తన ఇద్దరు మిత్రులతో కలసి స్కూటర్‌పై కావలికి బయలు దేరారు. అయితే చినక్రక ఎస్.సి కాలనీ సమీపంలోకి వచ్చేసరికి కావలినుంచి కలిగిరివైపు వెళుతున్న మినీలారి డీకొట్టింది. దీంతో దినేష్ అక్కడి కక్కడే మృతి చెందగా ఫ్రెండ్స్ ఇద్దరికి గాయాలైనాయి. విషయం తెలుసుకున్న ఎఎస్.ఐ హరిబాబు హుటాహుటిన సిబ్బందితో సంఘటనా స్తలానికి వెళ్ళి పరిశీలించడు. మృతదేహాన్ని కావలి ఏరియావైద్యశాలకు తరలించారు. కేసునమోదుచేసి ధర్యాప్తుచేస్తున్నట్లు తెలియజేశాడు.

## వై.ఎస్.ఆర్ క్లినిక్‌ద్వారా ప్రతి గ్రామానికి వైద్యసేవలు



**కావలి, రూరల్, అక్టోబర్27, ప్రభాతవార్త:** రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన వై.ఎస్.ఆర్ క్లినిక్‌లద్వారా ప్రతి గ్రామానికి వైద్యసేవలందించాలని సర్వాయపాళెం ప్రాదమిక ఆరోగ్యకేంద్రం వైద్యాదికారి హరికృష్ణ తెలిపారు. కావలి రూరల్‌మండలం రుద్రుకోటలో హెల్త్‌క్లినిక్ నందు గురువారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా డాక్టర్ హరికృష్ణ మాట్లాడుతూ వై.ఎస్.ఆర్ క్లినిక్‌లద్వారా ప్రతి గ్రామానికి వైద్యసేవలు అందించాలన్న సంకల్పంతో ఈకార్యక్రమం ప్రవేశపెట్టారన్నారు. మండలంలోని ప్రతి గ్రామాన్ని రెండు సార్లు వైద్యుల బృందం సందర్శించి అవసరమైన పరీక్షలు చేసి మందులు పంపిణీచేయడం జరుగుతుందన్నారు. సర్జరీలు వంటివి అవసరమైతే మండలకేంద్రాలకు పంపించి తగిన వైద్యం అందేవిదంగా చూడడం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో దాదాపు 150 మందికి వైద్యసేవలు అందించడం జరిగిందన్నారు. ఈకార్యక్రమంలో డాక్టర్ లక్ష్మీమాదురి, సూపర్‌వైజర్ శాంతమ్మ, ఎం.ఎల్.హెచ్.పి లక్ష్మీప్రవళిక, హెల్త్ అసిస్టెంటు సి.హెచ్ ప్రభాకర్‌రావు, ఎఎన్.ఎమ్‌లు తిరుపతమ్మ, రాధిక, శ్యామల ఆశావర్కలు శాంతికుమారి, జయలక్ష్మి, సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

## సమాజం కోరేది సాహిత్యం



**నెల్లూరు టౌన్, అక్టోబరు 27, ప్రభాతవార్త:** సమాజహితం కోరేది నిజమైన సాహిత్యమని రచయిత పింగళి పాడు రంగారావు పేర్కొన్నారు. పినాకినీ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం నెల్లూరులోని రేబాల లక్ష్మీ నరసారెడ్డి స్మారక భవనం (టౌన్‌హాల్) నందు రఘుకుమార్ రచించిన భక్త కన్నప్ప, భక్త తుకారం రెండు పుస్తకాల ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తక ఆదరణ పెంచాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై, ఉపాధ్యాయులపై ఉందని తెలిపారు. సభాధ్యక్షులు పోలవరపు లక్ష్మీ నరసింహారావు మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి పుస్తకం యొక్క విలువ తెలుసుకుని కొత్త కొత్త పుస్తకాలను చదవాల్సిన అవసరం ఎంతో ఉందని వివరించారు. భక్త కన్నప్ప పుస్తక పరిచయాన్ని ఊరుబిండి వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రి పరిచయం చేయగా, భక్త తుకారాం పుస్తక పరిచయాన్ని బొగ్గరపు రాధాకృష్ణమూర్తి పరిచయం చేశారు. అనంతరం పుస్తక రచయిత ఎన్.రఘుకుమార్ దంపతులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు కె.మురళీమోహన్‌రాజు, రచయిత ఎన్.రఘుకుమార్, విశ్రాంత ప్రిన్సిపాల్ ఎస్.వి.స్వామి, చెన్నై హాస్పిటల్స్ ఇన్ఫర్మేషన్ సెంటర్ అధినేత ఎస్.వి.రమేష్‌బాబు, డాక్టర్ చీమకుర్తి వెంకటేశ్వరరావు, పి.వి.రెడ్డి, అళహరి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఎర్రబల్లిలో గడప, గడపకు మన ప్రభుత్వం

**కొండాపురం, అక్టోబర్27, ప్రభాతవార్త:** నేడు కొండాపురం మండలం తూర్పు ఎర్రబల్లిలో గడప, గడపకు మన ప్రభుత్వం అనే కార్యక్రమం వుంటుందని వై.సి.పి మండల కన్వీనర్ చిమ్మిలి.రాజేంద్రప్రసాద్ తెలి పాడు. తొలుత గ్రామ సచివాలయం, వాటర్ ప్లాంట్ ప్రారంభోత్సవాలు వుంటాయని అన్నారు. అనంతరం గడ ప, గడపకు మనప్రభుత్వం అనే కార్యక్రమాలు నిర్వహించడం జరగుతుందన్నారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిదిగా ఉదయగిరి నియోజకవర్గ శాసనసభ్యులు మేకపాటి. చంద్రశేఖరరెడ్డి, పార్టీ ప్రచారకార్యదర్శి శాంతికుమారిలు పాల్గొంటారన్నారు. ఈకార్యక్రమానికి వై.సి.పి కార్యకర్తలు, అభిమానులు ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

## అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత




**కొండాపరం, అక్టోబర్27, ప్రభాతవార్త:** కొండాపురం మండలం ఇస్కాదామెర్ల పంచాయతి సమీపాన వున్న పిల్లాపేరు వాగునుంచి అనుమతులు లేకుండా ఇసుకను ట్రాక్టర్‌ను వింజమూరు సెబ్ అధికారులు వలపన్ని పట్టుకొని కొండాపురం పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు.

## ఉత్సాహభరితంగా క్రీడా పోటీలు



**కొండాపురం, అక్టోబర్27, ప్రభాతవార్త:** మండలకేంద్రమైన కొండాపురం జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో గురువారం మండలస్థాయిలో క్రీడా పోటీలు నిర్వహించారు. ఈపోటీలలో షుమారు200మంది విద్యార్థులు పాలొన్నారు. కొకొ, కబడి, వాలీబాల్, బాల్‌బ్యాట్‌మెంటన్, అథ్లెటెక్స్ పోటీలు నిర్వహించారు. వీటిలో గెలుపొందినవారునవంబర్7నుంచి జరుగు నియోజకవర్గ స్తాయి పోటీలలో పాల్గొంటారన్నారు. ఈకార్యక్రమంలో ప్రదానోపాద్యాయుడు అబ్దుల్ రహీం, చంద్రశేఖరరెడ్డి తదితర ఉపాద్యాయులు, విద్యార్దులు పాల్గొన్నారు.

## క్రీడల పట్ల విద్యార్దులు మక్కువ చూపాలి




**కోవూరు అక్టోబర్ 27 ప్రభాతవార్త** క్రీడలు మానసిక ఉల్లాసం కలిగించడమే కాకుండా మెదడుకు పదును పెడతాయని ప్రధానోపాద్యాయులు నరసింహమూర్తి తెలిపారు. కోవూరులోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో గురువారం మండలస్దాయి క్రీడాపోటీల ఎంపికలను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు ప్రతి విద్యార్ది ప్రాధమిక దశనుండి చదువుతోపాటు క్రీడలపట్ల కూడా ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. అదే విధంగా ప్రతి విద్యార్ది గెలుపు ఓటమిలు సమానంగా తీసుకొని క్రీడా సూ ర్తి కలిగి ఉండాలని అన్నారు. ఈ సందర్భంగా త్రోబాల్, యోగా, టెన్నికాయిట్ సంబంధించి పోటీలు నిర్వహించి మండలస్దాయి క్రీడాకారులను ఎంపిక చేశారు. ఈకార్యక్రమంలో పాఠశాల ఫిజికల్ డైరక్టర్ దేవిక, పి డెలీలా, కె నాగరాజు, పిఇటిలు వెంకటసుబ్బమ్మ, కె సాయితేజా, పి జాన్సన్, ఉన్నారు.

## సైదాపురంలో మండల స్థాయి క్రీడల పోటీలు



**సైదాపురం, అక్టోబరు 27, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన సైదాపురంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు మండల స్థాయి జెడ్పీ పాఠశాలల విద్యార్థులకు సంబంధించి క్రీడల పోటీలు గురువారం ప్రధా నోపాధ్యాయురాలు పార్వతమ్మ అధ్యక్షతన ప్రారంభించారు. ఈ సందర్భంగా మండలంలోని 7 పాఠశాలల నుంచి 80 మంది విద్యార్థులు వాలీబాల్, కోకో, టెన్నికాయిట్ క్రీడలలో పాల్గొన్నారు. సైదాపురం సర్పంచు వెందోటి శారదమ్మ, శ్రీకృష్ణ యాదవ సేవా సమితి మండల అధ్యక్షుడు కొండాపు మోహన్‌రావు, క్రీడల నిర్వహణ కార్యదర్శి కోటేశ్వరరావు, మండల పీడీలు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వలంటీర్ల పనితీరు మరింత మెరుగుపరచుకోవాలి



**సైదాపురం, అక్టోబరు 27, ప్రభాతవార్త:** గ్రామ సచివాలయాల్లో విధులు నిర్వర్తిస్తున్న వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, వారి పని తీరును మరింత మెరుగుపరచుకుని ప్రజలకు సేవలందించాలని ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్ తెలిపారు. మండల పరిధిలోని కొమ్మిపాడు, పోతేగుంట సచివాలయాలను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా హాజరు పట్టికలను తనిఖీ చేశారు. అనంతరం పోతేగుంటలో ఇద్దరు వలంటీర్ల పని తీరు సక్రమంగా లేనందున వారికి నోటీసులు జారీ చేయడం జరిగిందన్నారు. సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు ప్రజలకు అందుబాటులో లేకుండా, సమయ పాలన పాటించకుండా ఉంటే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రధానంగా వలంటీర్ల పనితీరు మరింత మెరుగుపరచుకుని ప్రజలకు సేవలందించాలన్నారు. అనంతరం కొమ్మిపాడు ప్రాథమిక పాఠశాలను సందర్శించి ఆర్‌వో ప్లాంట్ లీకేజి ఉండడంతో మరమ్మతులు చేయించుకునేందుకు చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి చంద్రమోహన్, సచివాలయ సిబ్బందిది, వలంటీర్లు ఉన్నారు.

## గండిపాళెం స్కూల్‌లో పేరెంట్స్ మీటింగ్



**ప్రకటన**
KKR కన్‌స్ట్రక్షన్స్ ఫరం తే 26-04-2019దిన రిజిస్ట్రేషన్ అయిన రిజిస్ట్రేషన్ నెం.111/2019 నందు బాగస్తుల మైన మేము తే 01-04-2022 ది నుండి వైదొలగడము జరిగింది కావున ఫరంకు సంబంధించిన ఆస్తులకు గానీ అప్పలకు గానీ మరియు ఏ ఇతర లావాదేవీలకు మాకు ఎటువంటి సంబందము లేదు అని తెలియజేయడమైనది.
కేతిరెడ్డి సీతారావమ్మ,
కలికి సుజాతమ్మ, కావలి

**ఉదయగిరి అక్టోబర్ 27 ప్రభాతవార్త** ఉదయగిరి మండలంలోని గండి పాలెం గ్రామంలోని గుంటుపల్లిచౌదరి జడ్పిస్కూల్‌లో పేరెంట్స్ మీ టింగ్ జరిగింది. ఈకార్యక్రమంలో స్కూల్ ప్రధానోపాధ్యాయులు వెంక టేశ్వర్లు మాట్లాడుతు తల్లిదండ్రులు పిల్లల్ని స్కూల్‌కి పంపేటప్పుడు ఖచ్చితంగా యూనిఫాం వేసి పంపాలని తెలిపారు. అలాగే స్కూల్ నుండి వచ్చిన తరువాత టీచర్లు బోధించిన విద్యను వారికి మరోసారి గుర్తు చేస్తు సాయింకాలం సమయాన వారిని కూర్చుబెట్టుకొని తరుగతుల విద్యపై ఆరాతీయాలని అన్నారు. స్కూల్స్‌లో జరిగే నాడు-నేడు పనుల గురించి తల్లిదండ్రులకు వివరించారు. అలాగే సీజనల్ వ్యాధుల పట్ల పిల్లలకు పరిశుభ్రత నేర్పించాలని తెలిపారు. ఈ సమావేశంలో స్కూల్ చైర్మన్ ఎస్‌కె రియాజ్, ఉపాద్యాయులు, పిల్లల తల్లిదండ్రులు పాల్గోన్నారు.

## ఎపి జెన్కో ప్రైవేటీకరణను ఆపాలి




**కావలి, అక్టోబరు 27 ప్రభాతవార్త** శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో వున్న ఎపి జెన్కో ప్రైవేటీకరణను వెంటనే నిలుపుదల చేయాలని సిపియం నేతలు డిమాండ్ చేశారు. ప్రైవేటీకరణను నిరసిస్తూ కావలి పట్టణ జాతీయ రహదారిపై అంబేద్కర్ విగ్రహం వద్ద సిపియం పార్టీ ఆధ్వర్యంలో గురువారం నిరసన నినాదాల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సిపియం జిల్లా కమిటీ సభ్యులు పసుపులేటి పెంచలయ్య మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 21 వేల కోట్ల రూపాయలతో నిర్మించిన ఒకే ఒక దామోదరం సంజీవయ్య ఎపి జెన్కో థర్మల్ ప్లాంట్‌ను జగన్‌రెడ్డి ప్రభుత్వం ఆదానికి అప్పజెప్పడం దుర్మార్గమైన చర్య అన్నారు. ఈ ప్రైవేటీకరణను ఆపాలన్నారు. ఇక్కడి కార్మికులు, ఉద్యోగులు 280 రోజులుగా ఆందోళన కొనసాగిస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరిని అవలంభిస్తుందన్నారు. ఈ రోజు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నెల్లూరు జిల్లాకు వచ్చి ఈ ప్లాంట్ మూడవ యూనిట్‌ను ప్రారంభించడం ఇదెక్కడి న్యాయమన్నారు. ప్రజలకు, కార్మికులకు అనేక వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి ఈ ప్రైవేటీకరణ వల్ల 2 వేల మంది ఉద్యోగ, కార్మికులు వీధిన పడే పరిస్థితి దాపురించిందన్నారు. అంతేకాకుండా ఈ ప్రాంత రైతులు ఎన్నో ఆశలు పెట్టుకొని ఈ ప్లాంట్ నిర్మాణానికి 33 వేల ఎకరాల భూములు ఇచ్చారన్నారు. ఈ రైతుల ఆశలపై నీళ్లు జల్లుతూ ముఖ్యమంత్రి ప్రారంభించడం దారుణమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తూ బడా పారిశ్రామికవేత్తలకు కట్టబెడుతున్నారన్నారు. ఉద్యోగ, కార్మిక కుటుంబాలను వీధి పాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించి ఎపి జెన్కో ప్రైవేటీకరణను ఆపాలని డిమాండ్ చేశారు. ప్రైవేటీకరణ ఆలోచనకు స్వస్తి చెప్పకపోతే కార్మిక, ప్రజా ఉద్యమాలు పెద్దఎత్తున కొనసాగిస్తామని హెచ్చరికలు చేశారు. సిపి యం పట్టణ కమిటీ సభ్యులు జి.మధుసూదన్‌రావు, యర్రంశెట్టి కృష్ణమోహన్, నరసింహం, నాయకులు బి.కృష్ణయ్య, కె.చెన్నయ్య, డివైఎఫ్ఐ నాయకులు పి.కోటేశ్వరరావు, వెంకీ, తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాహుల్ నాయకత్వం దేశానికి అవసరం



**అనుమసముద్రంపేట, అక్టోబర్27, ప్రభాతవార్త:** సెప్టెంబర్7 నుండి కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు కాంగ్రెస్‌పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ తలపెట్టిన భారత్‌జోడో యాత్ర దిగ్విజయంగా కొనసాగుతూ తమిళనాడు, కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు పూర్తిచేసుకొని తెలంగాణాలో ప్రవేశించి దేశ సమైక్యత సమగ్రతకు పాటుపడుతూ విద్యార్థులు, యువకులు, వృద్ధులు, మహిళలు, కర్షకకార్మికులు, రైతులు, వికలాంగులు, స్వచ్ఛంద సంస్థలు, ఉద్యోగులు ప్రతి ఒక్కరితో మమేకమవుతూ భారతేదశానికి అన్ని విధాలుగా అండగా ఉంటానని ప్రజలకు భరోసాకల్పిస్తూ యాత్ర ముందుకు సాగిస్తున్న రాహుల్‌గాంధీతో కలసి రాష్ట్రమంతా పాద యాత్ర చేయడం తన అదృష్టంగా భావిస్తున్నానని ఆత్మకూరు నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జ్ పిసిసి ప్రధాన కార్యదర్శి చేవూరు శ్రీధర్‌రెడ్డి తెలిపారు. అలాగే తెలంగాణాలో కూడా రాహుల్‌గాంధీతో కలసి పాదయాత్రలో పాల్గొంటానన్నారు. రాహుల్‌గాంధీ పాదయాత్ర ఆంధ్రప్రదేశ్‌లో విజయవంతం కావడానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. 2024లో కాంగ్రెస్‌పార్టీ తప్పకుండా విజయం సాధిస్తుందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో దేశానికి రాహుల్‌గాంధీ నాయకత్వం అవసరమన్నారు. ఖార్గే ఎన్నిక చరిత్రాత్మకం. అఖిల భారత కాంగ్రెస్‌పార్టీ కమిటీ అధ్యక్షుడిగా కర్నాటక రాష్ట్రానికి చెందిన సీనియర్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు మల్లిఖార్జున ఖార్గే ఎన్నిక కావడం దేశకాంగ్రెస్ చరిత్రలో సువర్ణ అధ్యాయమన్నారు. ఈ ఎన్నిక ద్వారా సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, బలహీన వర్గాల పట్ల చిత్తశుద్ధితో ఉన్నారో నిరూపితమవుతుందన్నారు.

## విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ




**అనుమసముద్రంపేట, అక్టోబర్27, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన ఏఎస్‌పేటలోని స్థానిక జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో గురువారం పాఠశాల భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు ఎం.డి.అంజాద్‌బాషా, డాక్టర్ సి.హెచ్. సురేష్‌లు 10వ తరగతి విద్యార్థులకు సులభమైన పద్ధతిలో సిలబస్ నేర్చుకునేందుకు తయారు చేసిన స్టడీ మెటీరియల్ పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈసారి 10వ తరగతి పరిక్షల్లో ఏ ఒక్కరు కూడా భౌతిక శాస్త్రంలో ఫెయిల్ కాకుండా జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు ఆర్.శివనాగమ్మ పుట్టిన రోజు సందర్భంగా పాఠశాల గ్రంథాలయానికి పిల్లలకు అవసరమైన ప్రేరణ కలగజేసే డాక్టర్ బి.వి. పట్టాభిరామ్, రవీంద్రనాథ్, వేణుభగవాన్‌లు రచించిన పుస్తకాలను బహూకరించారు. గ్రాంథాలయానికి ఒక్కొక్కరు ఒక్కొక్క పుస్తకాన్ని పాఠశాలలో బహూకరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సయ్యద్ అబ్దుల్ హమీద్, ప్రధానోపాధ్యాయుడు, సైన్స్ ఉపాధ్యాయులు అభినందించారు. బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## జాతిపితను అవమానించడం మంచి పద్ధతి కాదు

**బుచ్చి అక్టోబర్ 27 ప్రభాతవార్త** అహింసా అనే ఆయుధంతో దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన మహానీయుడ్ని ఏపి రాష్ట్ర ప్రభుత్వ ఎస్సి కమీషన్ చైర్మన్ విక్టరి ప్రసాద్ అవమానిస్తు ఆయనపై అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణమని ఆర్యవైశ్యనేతలు ఎం.వి శేషయ్య, సొల్లేటి ప్రభాకర్,దర్శి మాలకొండయ్య,దర్శి బాలు ఖండించారు. కమీషన్ స్థాయిలో ఉన్న వ్యక్తి జాతిపితను అవమానించి ప్రజలకు మీరు ఏమి సందేశం ఇస్తున్నారని ఆయన ప్రశ్నించారు.ప్రపంచం మొత్తం శాంతిదూతగా పిలిచే జాతిపితపైన అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణమని వారు ఖండించారు.వెంటనే ఆవ్యాఖ్యలను వెనుకకు తీసుకోకపోతే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.ఈ సందర్భంగా జాతిపితమహాత్మాగాంధీ విగ్రహానికి పాలాభిషేకంచేశారు. ఆర్య వైశ్యనేతలు గాదంశెట్టి శ్రీనివాసులు,దర్శి చినమాలకొండయ్య,బచ్చుసుబ్బారావు,గుబ్బా సూర్యనారాయణ ,జెండాదిబ్బ ఉపసర్పంచ్ ఆర్యవైశ్యనాయకులు గుర్రం నరేష్,చెంబేటి ప్రసాద్ పలువురు పాల్గొన్నారు.

## వైద్యశాలకు మరింత పేరు తేవాలి



**కోవూరు అక్టోబర్ 27 ప్రభాతవార్త** కోవూరు ప్రభుత్వ వైద శాలకు మరింత పేరు తెచ్చాలే వైద్యులు సమిష్టి కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా వుందని జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ దొద్దంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి పేర్కున్నారు. కోవూరులోని పార్టీ కార్యలయంలో గురువారం కోవూరు వైద్యశాలకు సూపర్నెంట్ డాక్టర్ విజేత,జనరల్ సర్జన్ డాక్టర్ చలపతి ,ల్యాబ్ ఇన్‌చార్జి కేశవ్‌కళ్యాణ్‌లు మర్యాదపూర్వకంగా కలిసి వైద్యశాలకు సంబంధించిన పలు విషయాలు చర్చించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు జిల్లాలోనే కోవూరు వైద్యశాలకు మంచి పేరు ఉందని దానిని మరింత ఇనుమడింప చేసేలా చొరవ తీసుకోవాలని అన్నారు. ఆసుపత్రికి సంబంధించి సమస్యలు ఏమైనా ఉంటే కోవూరు ఎమ్మేల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి దృష్టికి తీసుకొని వెళుతానని అన్నారు.ఈకార్యక్రమంలో కోవూరు ఎఎంసి చైర్మన్ రాధాకృష్ణారెడ్డి ఉన్నారు.

## నూతన బైపాస్‌రోడ్డు రైతులకు నగర ప్రజలకు ఎంతో అవసరం



**బుచ్చి అక్టోబర్ 27 ప్రభాతవార్త** రాజుపాలెం రోడ్డు నుండి బుచ్చిరెడ్డిపాళెం ముంబాయి రోడ్డుకు అనుసంధానం చేస్తు నూతనంగా నిర్మాణం చేస్తున్న బైపాస్ రోడ్డు ఎంతో ఉపయోగకరమని పెన్నాడెల్టా ప్రాజక్టు చైర్మన్ యర్రంరెడ్డి గోవర్దన్‌రెడ్డి,జొన్నవాడ దేవస్ధానం చైర్మన్ పుట్టా సుబ్రమణ్యం తెలిపారు.రేబాల గ్రామంలోని యర్రంరెడ్డి ఇంట్లో జరిగిన విలేఖర్ల సమావేశంలో వారు మాట్లాడుతు ఆరోడ్డు గతంలో దండుబాట అని వారు స్పష్టం చేశారు.ఎమే ల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ముందు ఆలోచనతో అభివృద్ధి చెందుతున్న బుచ్చిరెడ్డిపాళెం నగరపాలక పంచాయితీలో భవిష్యత్తులో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ఈరోడ్డు నిర్మాణం చేస్తున్నారని వారు తెలిపారు.ఈరోడ్డు నిర్మాణం చేసినందువల్ల రైతులకు ఎంతో ఉపయోగకరమని అన్నారు. ఎప్పుడైనా ముంబాయి రోడ్డులో ట్రాఫిక్ సమస్య తలెత్తినప్పుడు ఈ రహదారి గుండా రాజుపాళెం మీద నెల్లూరుకి వెళ్ల వచ్చునని అన్నారు.ఈబైపాస్ రోడ్డు వల్ల బుచ్చిరెడ్డిపాళెం భవిష్యత్తులో ఎంతో అభివృద్ధి చెం దుతుందని చెప్పారు. ప్రస్తుతం ఆరోడ్డు పక్కన ఎవ్వరు రియల్ ఎస్టేట్ వేయలేదని అన్నారు. ఎమ్మేల్యేని రైతులందరు అభ్యర్ధించిన తరువాత దానిని అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు.ఈరోడ్డుపైన ఒక్క రూపాయి కూడా ప్రభుత్వం నగదు ఖర్చు చేయలేదని అన్నారు.ఈరోడ్డు బాగులేదని రైతులు ఎవ్వరైనా అభ్యంతరం వ్యక్తం చేశారా అని వారు ప్రశ్నించారు. అభివృద్దిని అడ్డుకోవడం మంచి పద్దతి కాదని వారు హితవు పలికారు.ఈకార్యక్రమంలో వైసిపి నాయకులు వల్లూరు రాఘవరెడ్డి,మండలపార్టీ అద్యక్షులు సతీష్‌రెడ్డి,కోడూరు మదుసూదన్‌రెడ్డి,మొర్ల మురళీ,ఆదిశేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జొన్నవాడ కామాక్షితాయి పాంప్లేట్ ఆవిష్కరణ



**బుచ్చి అక్టోబర్ 27 ప్రభాతవార్త** పవిత్రపుణ్యక్షేత్రమైన జొన్నవాడలోని శ్రీమల్లికార్జునస్వామి కామాక్షితాయి సన్నిధిలో కార్తికమాసం పురస్కరించుకొని ఆలయ చైర్మన్ పుట్టా లక్ష్మీ సుబ్రహ్మణ్యంనాయుడు దంపతు లు, ఆలయ కార్యనిర్వహణాధికారి డబ్బుగుంట వెంకటేశ్వర్లు కార్తిక మాసం పాంప్లేట్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు దేవస్ధానం విదులు నిర్వహిస్తున్న రిలీజియస్,సెక్యూలర్,ఔట్ సోర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రమాద బాధితురాలికి సుఖ ప్రసవం

**నెల్లూరురూరల్, అక్టోబరు 27 ప్రభాతవార్త** ఆటో ప్రమాదంలో గాయపడి కాలు విరిగి అపస్మారకస్దితిలోకి వెళ్లిన 8 నెలల గర్భవతికి కాలుకు విజయవంతంగా శస్త్రచికిత్స చేయడంతోపాటు విజయవంతంగా కాన్పు చేసి నెల్లూరు మెడికవల్ వైద్యులు తమ ప్రతిభను చాటుకున్నారు. గురువారం మెడికవల్ హాస్పిటల్ ఆడిటోరియంలో విలేకరుల సమావేశం ఏర్పాటుచేసిన సెంటర్‌హెడ్ డాక్టర్ గణేష్ ఇందుకు సంబంధించిన వివరాలను తెలియజేశారు. భర్తతో బైక్‌పై వెలుతున్న 8 నెలల గర్భిణీని వెనుకనుండి ఆటో ఢీ కొనడంతో ఆమెకాలు విరగడంతోపాటు అపస్మారకస్దితిలోకి వెళ్లింది. మెడికవర్ హాస్పిటల్‌లో చేరిన బాదితురాలికి అత్యవసర వైద్య విభాగాధిపతి డాక్టర్ కృష్ణచైతన్య అపస్మారకస్దితిలో నుండి సాధారణ స్దితిలోకి తీసుకొని రాగా ఎముకల శస్త్ర నిపుణులు డాక్టర్ శశిధర్‌రెడ్డి విరిగిన కాలుకు విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించారు. అనంతరం రోగికి నొప్పులు రాగా డాక్టర్ సింధు, డాక్టర్ మమత, డాక్టర్ షఫీలు సంయుక్తంగా శస్త్రచికిత్స నిర్వహించగా 2.4 కిలోల మగబిడ్డ జన్మించాడు. కాన్పు సమయంలో బాధితురాలికి ఫిట్స్ రాగా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి నమయం చేశారు. తల్లీబిడ్డ క్షేమంగా వున్నారని ఈ సందర్భంగా పేర్కొన్న సెంటర్‌హెడ్ క్రిటికల్‌కేర్ వైద్యాన్ని చాకచక్యంగా నిర్వహించిన వైద్యబృందాన్ని అభినందించారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, అనుభవజ్ఞులైన వైద్యబృందం వున్నందునే తాము క్లిష్టమైన చికిత్సలను సైతం విజయవంతం చేస్తున్నామన్నారు. సమావేశంలో పాల్గొన్న బాధితురాలు తనను కాపాడిన వైద్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## రోడ్డు ప్రమాదంలో భీమవరం వాసి మృతి



**మర్రిపాడు, అక్టోబర్27, ప్రభాతవార్త:** మర్రిపాడు మండలం భీమవరంకు చెం దిన గొట్ల మదన్మోహన్ పనినిమిత్తం బద్వేల్‌కి వెళ్ళి తిరుగు ప్రయాణం భీమ వరం వస్తుండగా నెల్లూరు-ముంబై జాతీయ రహదారిపై కడప జిల్లా గోప వరం మండలం గోపవరం గ్రామం సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. పోస్టుమార్టం నిమ్తిం మృత దేహా న్ని బద్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గోపవరం పోలీస్‌స్టేషన్ సిబ్బంది సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నామని కుటుంబ సభ్యులకు తెలిపారు. అతి చిన్న వయసు లోమదన్‌మోహన్ మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు శోకసముద్రంలో మునిగిపోయారు .

## ధనదాహంతో జెన్‌కోను ప్రైవేటు పరం చేస్తున్న జగన్



**నెల్లూరు అక్టోబర్ 27, ప్రభాతవార్త-వైద్యం** జగన్ ధనదాహంతోనే ఏపీ జెన్‌కో పవర్ ప్లాంటును అదానికి అంటగడుతున్నాడని తెలుగుదేశం పార్టీ నగర నియోజకవర్గ ఇన్‌చార్జ్ కోటంరెడ్డి.శ్రీనివాసులురెడ్డి ఆరో పించారు. గురువారం నగరంలోని ఆయన నివాసంలో జగన్ జెన్‌కో పవర్ ప్లాంటు ప్రారంభోత్సవానికి వస్తున్న తరుణంలో ఆయన కాన్వాయ్‌ని ఎక్కడ అడ్డుకుని నిరసన తెలుపుతారో అనే ఆలోచనతో ముందస్తు పోలీసులు శ్రీనివాసులురెడ్డికి నోటీసులు ఇచ్చి గృహనిర్బంధం చేశారు. ఈ తరుణంలో సిపిఎం నాయకుడు మోహన్‌రావు, కాయం శీనయ్య, సూర్యనారాయణ, సిపిఐ నాయకుడు దామా.అంకయ్య, రామరాజులను ఆరోవ పట్టణ పోలీసు ఠాణాకుతరలించారు. ఈ సందర్భంగా కోటంరెడ్డి.శ్రీనివాసులురెడ్డి విలేఖరులతో మాట్లాడుతూ రాజశేఖర్‌రెడ్డి ఏర్పాటు చేసిన పవర్‌ప్లాంటును జగన్ అమ్మేదం చూస్తూంటే తండ్రినే అమ్మే స్తున్నట్లుందన్నారు. థర్మల్ పవర్ ప్లాంటు కోసం జెన్‌కో కార్మికులతో కలిసి సోమిరెడ్డి.చంద్రమోహన్‌రెడ్డి నాయకత్వంలో 208రోజులు ధర్నా చేశారని ఆయన గుర్తుచేశారు. జగన్‌కి కాకినాడ, రాయలసీమలో ఉన్న విద్యుత్ స్టేషన్లను అదానికి ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించాడు. అదానికి దీనిని అంటగట్టి రానున్న ఎన్నికలలో డబ్బులు తీసుకునేందుకు ఇవి చేస్తున్నాడని విమర్శించాడు. కార్పొరేషన్ పరిధిలో సైడు కాలువలు కట్టాలంటేనే వేరే వారికి టెండర్లు వేసే అవకాశం ఇవ్వడం లేదనది అలాంటిది రూ.23వేల కోట్ల టెండర్లు వేరేవారికి అవకాశం ఇస్తారాని ఆయన ప్రశ్నించారు. కేవలం ముడుపుల కోసమే థర్మల్ పవర్‌ప్లాంటును అదానికి కట్టబెడుతున్నాడని కోటంరెడ్డి మండిపడ్డారు. పవర్‌ప్లాంటు ప్రాంతవాసులకు దానిని ప్రైవేటు పరం చేయకూడదనే నిరసన తెలిపే హక్కును లేకుండా పోలీసులు నోటీసులు జారీ చేయడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో కప్పిర.శ్రీనివాసులు, కువ్వారపు.బాలాజీ, గంగాధర్‌రెడ్డి, పిఆర్‌వి.మురళి, పసు పులేటి. మల్లిఖార్జున, పెంచలనాయుడు, ఆకుల.హనుమంతురావు, తంబి.సుజన్‌కుమార్, కప్పిర.రేవతి, మందా. రవి, ఎద్దల.రవి, అబ్దుల్ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

## వంశీకి ఘన సన్మానం



**మర్రిపాడు, అక్టోబర్27, ప్రభాతవార్త:** మర్రిపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ఎంపిసి పూర్తిచేసి దేశవ్యాప్తంగా నిర్వహించిన జెఇఇ అడ్వాన్స్‌డ్ పరిక్షల్లో 2263వ ర్యాంకును సాధించిన మద్రాసు ఐఐటి కాలేజీనందు సివిల్ ఇంజనీరింగ్ సీటు సాధించిన ఉంటా వంశీని గురువారం కళాశాల ప్రిన్స్‌పాల్ హనుమంతరాజు , కళాశాల అధ్యపకులు విద్యార్థుల సమక్షంలో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఉంటా వంశీ మాట్లాడుతూ తాను సీటు సాధించడంలో తమ కళాశాల ప్రిన్స్‌పాల్ హనుమంతరాజు , కళాశాల అధ్యాపకుల ప్రోత్సాహం ఎంతగానో ఉందని కొనియాడారు. ప్రస్తుతం ఇంటర్ సెంకడర్ ఇయర్, ఫస్టియర్ చదువుతున్న విద్యార్థులకు జెఇఇ మెయిన్స్, అడ్వాన్స్ పరిక్షలకు సంబంధించిన సూచనలు, సలహాలు ఇచ్చారు.

## రైతు నాయకుల అక్రమ అరెస్టులు



**ఉదయగిరి అక్టోబర్ 27 ప్రభాతవార్త** జిల్లాలో ఉన్న ఏకైక ప్రభుత్వం రంగ సంస్ధ అయిన జెన్‌కోను అదానికి అప్పగించేందుకు వస్తున్న ముఖ్యమం త్రిని అడ్డగిస్తామని పోలీసులు రైతు నాయకులను అరెస్టు చేయడం తగదని ఏపి రైతు సంఘం నాయకులు కాకు వెంకటయ్య మండిపడ్డారు.285 రోజులు పైబడి కార్మికులు ధర్నా చేపడితే కనీసం వారిని పలకరించడానికి తిరికలేని సిఎం జెన్‌కోను జాతికి అంకితం చేయడం ఎంత వరకు సమంజిసమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అదానికి అప్పజెప్పవద్దని నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యమకారులపై దౌర్జన్యం చేయడం ఉద్యమాలు నీరు కారుస్తుండడం జెన్‌కోను జాతికి అంకితం చేయడంపై ప్రజలు ప్రతి ఒక్కరు తీవ్రంగా వ్యతిరేఖించాలని అన్నారు.ఇలాంటి అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని మరింతగా ఉదృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.

## క్రీడా జట్ల ఎంపిక ప్రక్రియ ప్రారంభం



**వింజమూరు, అక్టోబర్27, ప్రభాతవార్త:** వింజమూరు మండల స్ధాయి అండర్ 11,14,17క్రీడాకారుల ఎంపిక ప్రక్రియను గురువారం ఎంఇఒ మాలకొండలరావ్ ప్రారంభించారు. వింజమూరులోని బాలుర ఉన్నత పాఠశాలలో మండల స్థాయి ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, బాల్‌బాట్మెంటన్ , త్రోబాల్, టెన్నికాయిట్, యోగా, అథ్లెటిక్స్ కు జట్ల ఎంపిక నిర్వహించారు . ఒక్కో పాఠశాల నుండి ఒక్కో క్రీడా అంశంలో ఇద్దరు బాలురు, ఇద్దరు బాలికలు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎంఇఒ మాలకొండల రావ్ మాట్లాడుతూ విద్యార్థుల మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. అలాగే శారీరక ధృఢత్వం పెంపొందిం చుకోవచ్చన్నారు. ప్రభుత్వం చదువులతోపాటు విద్యార్థులు క్రీడల్లో కూడా రాణించేలా తర్ఫీదునిస్తుందన్నారు. ప్రతి పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయులను ఏర్పాటు చేసి విద్యార్థులకు ప్రతి క్రీడలో శిక్షణ ఇస్తున్నారన్నారు. విద్యార్థులు క్రీడల్లో రాణించాలన్నారు. ఈకార్యక్రమంలో పిడి ప్రభాకర్‌రెడ్డి, పిఇటిలు వెలుగోటి కృష్ణ, రజనీవిలాసిని, ఎన్.శ్రీనివాసులు, ఎన్.మాచర్ల, వి.నాగరాజు , విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు

## హెచ్‌ఐవి, ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలి




**వింజమూరు, అక్టోబర్27, ప్రభాతవార్త:** ప్రజలు హెచ్‌ఐవి, ఎయిడ్స్ అవగాహన కలిగి ఉండాలని ఎపిఎఫ్ఎసిఎస్ (చైల్డ్‌ఫండ్ ఇండియా లింక్‌వర్కర్స్)డిఆర్‌పి సురేఖ పేర్కొన్నారు. గురువారం పంచాయతీ కార్యాలయ ఆవరణలో సర్పంచ్ నల్లగొండ్ల సృజన అధ్యక్షతన హెచ్‌ఐవి, ఎయిడ్స్‌పై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర ్భంగా డిఆర్‌పి సురేఖ మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తమ సంస్థ హెచ్‌ఐవి, ఎయిడ్స్ సంక్రమణ, నియంత్రించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రజల్లో అవగాహన కల్పిస్తూ నూరుశాతం ఎయిడ్స్ నియంత్రణకు పనిచేస్తుందన్నారు. హెచ్‌ఐవి, ఎయిడ్స్ సంక్రమణ గురించి , నియంత్రించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. హెచ్‌ఐవి నిర్ధారణ అయిన వ్యక్తి జీవిత కాలాన్ని పెంచేందుకు మందులు ఉన్నాయని, వ్యాది వచ్చిందని కృంగిపోక క్రమం తప్పకుండా మందులు వాడాలన్నారు . సర్పంచ్ సృజన మాట్లాడుతూ హెచ్‌ఐవి, ఎయిడ్స్ అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేయడం, ప్రజల్లో చైతన్యం తీసుకురావడం శుభపరిణామమన్నారు. వ్యాధులు, సంక్రమణ గురించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. అందరూ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా జీవించాలన్నారు. ఈకార్యక్రమంలో లింక్ వర్కర్స్ షేక్ మున్ని, ఎల్డబ్ల్యుఎస్ సూపర్‌వైజర్ కెజియ తదితరులు పాల్గొన్నారు.

## చందులూరుపాడులో వాసుదేవయ్య అంత్యక్రియలు



**అనుమసముద్రంపేట, అక్టోబర్27, ప్రభాతవార్త:** ఏఎస్‌పేట మండలం చందులూరుపాడుకు చెందిన బొమ్మంచు వాసేదవయ్య అంత్యక్రియలకు గురువారం ఆత్మకూరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్య నాయుడు హాజరయ్యారు. లక్ష్మయ్యనాయుడు వాసుదేవయ్య భార్యకు, ఆయన కుమారులు వెంకయ్య, వెంకటేష్‌లకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఏఎస్‌పేట మండల మాజీ తెలుగు యువత అధ్యక్షుడు కంచర్ల శ్రీధర్‌నాయుడు, వారి సోదరులు జానకిరామయ్య, పట్టాభిరామయ్య, శివయ్యపాల్గొన్నారు.

## హెల్ప్‌లైన్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి



**కోవూరు అక్టోబర్ 27 ప్రభాతవార్త** వృద్దులకోసం ప్రభుత్వం జాతీయ వృద్దుల హెల్ప్‌లైన్ 14567 ఏర్పాటు చేసిందని ఈ సేవలను వారు పూర్తి స్ధాయిలో ఉపయోగించుకోవాలని కోవూరు ఎంపిడిఒ శ్రీహరి తెలిపారు.కోవూరులోని మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం ఈ హెల్ప్‌లైన్ సేవలపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ హెల్ప్‌లైన్ ద్వారా వృద్దులకు ఏమైనా సమస్యలు ఉన్నా ఫెన్షన్ రాకపోయినా చట్టపరమైన సమస్యలపై సమాధానం ఇవ్వడం జరుగుతుందని అన్నారు.ఈ సందర్భంగా 2023-24కు సంబంధించిన పనులపై నివేదికను సిద్దం చేశారు.ఈకార్యక్రమంలో ఎంపిపి పార్వతీ,వైస్ ఎంపిపిలు నరసింహులు రెడ్డి ,సాయి లక్ష్మీ,నెల్లూరు ఫీల్డ్ రెస్‌పాన్స్ ఆఫీసర్ డి .భూషణం,కార్యలయ పర్యవేక్షలు చంద్రశేకర్ ఎంపిటిసి సభ్యులున్నారు.

## ఎంఎల్‌సి అభ్యర్దుల విజయానికి సమిష్టి కృషి అవసరం



**కోవూరు అక్టోబర్ 27 ప్రభాతవార్త** తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ పట్టభద్రుల ఎంఎల్‌సి అభ్యర్దుల విజయానికి సమిష్టి కృషి ఎంతైనా అవసరమని కోవూరు ఎమ్మేల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పేర్కు న్నారు.కోవూరులోని రుక్మిణి కళ్యాణ మండపంలో ఎంఎల్‌సి అభ్యర్దుల పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు జిల్లాలోనే కోవూరు నియోజకవర్గంలో అభ్యర్దులు ఇరువురుకి అత్యధిక మెజార్టీ వచ్చేలా కృషి చేయాల్సి న అవసరం ఎంతైనా ఉందని అన్నారు.నియోజకవర్గం 5 మండలాలలోని ప్రజాప్రతినిదులు,నాయకులు,కార్యకర్తలు సమన్వయం చేసుకొని అభ్యర్దుల గెలుపుకోసం విశేషంగా కృషి చేయాల్సి న అవసరం ఉందన్నారు.వైసిపి గాలి ఉందిలే అని ఏమరపాటు తగదని ఈ సందర్భంగా ఆయన నాయకులకు తెలియజేశారు.నాయకులను అప్రమత్తం చేశారు. అదే విధంగా నవంబర్ 5వ తేది లోగా ఓటు నమోదు కార్యక్రమాంపై అవగాహన కల్పించి సకాలంలో పూర్తి చేసేలా తగు చర్యలు తీసుకో వాలన్నారు.ప్రతి కార్యకర్త,నాయకుడు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ ఆనం అరుణమ్మ,డిసిఎంస్ చైర్మన్ వీరి చలపతిరావు,జిల్లా వ్యవసాయ మండలి చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, అప్కాప్ చైర్మన్ కె అనీల్‌బాబు ,రాష్ట్ర బొందిల సంఘం చైర్మన్ కిషోర్ సింగ్,ఎంఎంసి చైర్మన్ రాధాకృష్ణారెడ్డి,బుచ్చి నగరపాలక పంచాయితీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ,జొన్నవాడ దేవస్దానం చైర్మన్ పుట్టా సుబ్రమణ్యంనాయుడు,వవ్వేరు బ్యాంకు చైర్మన్ సూరా శ్రీనివాసులురెడ్డి,పెన్నాడెల్టా ప్రాజక్టు మాజీ చైర్మన్ యర్రంరెడ్డి గోవర్దన్‌రెడ్డి,పడుగుపాడు సొసైటీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి,మండల వ్యవసాయ సలహామండలి చైర్మన్ ప్రసాద్‌రెడ్డి,జడ్‌పిటిసి సభ్యురాలు శ్రీలత,ఎంపిపి టి.పార ్వతి,వైస్ ఎంపిపి నరసింహులురెడ్డి,కోవూరు నియోజవకర్గ పరిధిలోని 5 మండలాలకు సంబందించిన ప్రజా ప్రతినిదులు నాయకులు పాల్గొన్నారు.

## పొదలకూరులో ఆర్యవైశ్యుల నిరసన



**పొదలకూరు అక్టోబర్ 27 ప్రభాతవార్త** పొదలకూరు పట్టణంలో ఆర్యవైశ్యుల ఆద్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు.జాతిపిత మహాత్మాగాంధీని రాష్ట్ర ఎస్‌సి కమీషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు వ్యతిరేఖంగా నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఆర్యవైశ్యనాయకులు అమర్తలూరు చెంచయ్య ,పొట్టి సుధాకర్,నేతృత్వంలో మండల ఆర్యవైశ్యనాయకులు నల్లరిబ్బన్లు దరించి బారి స్ధాయిలో నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు.బస్టాండ్ ఆవరణంలో నెలకొల్పిన పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద గాందీజి చిత్రపటాన్ని ఏర్పాటు చేసి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి పూలమాలలు వేసి జాతిపితకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య వృద్ద నాయకుడు ఆదూరు సుబ్బులు మాట్లాడుతు శాంతియుతంగా ఉద్యమం చేసి బ్రిటిష్‌వారితో మాట్లాడి భారతదేశానికి స్వాతంత్ర్యం సాధించిన మహానుభావుడు భారతదేశం గర్వించ దగ్గ వ్యక్తి జాతిపితి మహాత్మగాంధీని ఏ అర్హతతో,ఏ ఉద్దేశంతో రాష్ట్ర ఎస్‌సి కమీషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్ అనుచిత వ్యాఖ్యలు చేశారని ప్రశ్నించారు.ఇందుకు క్షమాపణలు చెప్పాలని,చేసిన వ్యాఖలు వెనుకకు తీసుకోవాలని లేని పక్షంలో జాతియ ఆర్యవైశ్యుల సమైక్యతతో ఉద్యమానికి పిలుపునిస్తామని విక్టర్ ప్రసాద్ ఖబడ్దార్ అంటు నినాదాలు చేశారు.కార్యక్రమంలో పాల్గోన్న ఆర్యవైశ్యులు ముక్తకంఠంతో విక్టర్ ప్రసాద్ గోబా ్యక్ ఆర్యవైశ్యుల జోలికివస్తే ఖబడ్దార్ అంటు నినాదాలు చేశారు .ఈకార్యక్రమంలో ఆకులూరు హేమంత్,మదు,చిట్లూరు సు బ్రమణ్యం,కాకుమాని సతీష్,ఆకులూరు చంద్ర,ఆరోగ్య చంద్ర,ప్రభాకర్, హైటెక్ రమణయ్య,భగవాన్, దనుంజయ్,రామారావు, పాల్గోన్నారు.

## ఈ పంట నమోదు రైతులకు ఉపయోగకరం



**విడవలూరు అక్టోబర్ 27 ప్రభాతవార్త** వ్యవసాయం సాగు చేసే రైతులు ఈ పంట నమోదు చేసుకోవడం వలన వారికి అనేక ఉపయోగాలు ఉన్నాయని మండల వ్యవసాయాధికారి వెంకటకృష్ణయ్య తెలిపారు. విడవలూరు మండలంలోని వావిళ్ల చౌకచర్ల,తుమ్మగుంట ,దంపూరు గ్రామాలలో గురువారం ఆయన ఈ పంట నమోదుపై సూపర్ పరిశీలన కార్యక్రమాన్ని చేపటా ్టరు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు రైతులు పంటలు వేసుకునే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు.అదేవిధంగా వ్యవసాయాధికారుల సలహాలు సూచనలు తీసుకొని పంట దిగుబడి పెంచుకునేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు.రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు కావల్సిన విత్తనాలు యంత్ర పరికరాలను అందజేస్తున్నామని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించాఉ.ఈకార్యక్రమంలో వావిళ్ల ఆర్‌బికె ఇఎఒ చరణ్‌బాబు,రైతులున్నారు.